# బ్రెయిన్ - డ్రెయిన్

పాలంకి సత్య

అది చిన్న పెంకుటిల్లు. పైన కప్పు, చుట్టూ గోడలూ వున్నాయి కాబట్టే దాన్ని ఇల్లు అనాలి. సరిగ్గా వర్ణించాలంటే అది ఒక శిథిలమైన కట్టడం.

ఏ రాజా అందులో ఏనాడూ వుండలేదు. ఏ దేవుడికీ అది ఆలయమూ కాదు. లేకపోతే ఆర్కియాలజీ డిపార్టుమెంటు వాళ్ళు దాన్ని పడిపోకుండా కాపాడుతూ వుందురేమో ప్రస్తుతం అది ఇల్లు మాత్రమే. ఆ ఇంట్లో ఒక ఎలిమెంటరీ స్కూలు టీచరు మోహన్రావు గారుకాపురముంటున్నారు. ఆయన భార్య భారతి ఒళ్ళో మూడు నెలల కొడుకు రాజాని కూచో పెట్టుకుని కలలు కంటోంది. పిల్లవాడు ఎదిగి పెద్దవాడయి తనకు నిజమైన పుత్రోత్సాహాన్నిచ్చే రోజుని ఊహించుకుంటోంది. మోహన్రావు కూడా అదే ప్రయత్నంలో వున్నాడు.

"అబ్బాయిని మీరు పనిచేసే జిల్లా పరిషత్ స్కూల్లో వద్దు. పక్క ఊళ్ళో కాన్వెంటు పెట్టారుట. అంతా బాగుందిట. అక్కడ చేర్పిద్దాం"

"కాన్వెంటు అంటే మాటలా? బోల్డు ఫీజు కట్టాలి. ఇంకా బూట్సు, యూనిఫారాలు, పంపించడానికి రిక్షా ఖర్చులు..." పైకి అలా అన్నా మోహన్రావుకీ కాన్వెంటుకి పంపాలనే వుంది.

"అదేం మాట. మనకేమన్నా పది మంది పిల్లలా? ఒక్కగానొక్కడు. బాగా చదివించి పైకి తీసుకురావాలి. ఏదో ఒకటి ఇంకో ఖర్చు తగ్గించుకుందాం. అవసరమైతే నాలుగు ట్యూషన్లు చెప్పండి. బాలమ్మగారు ఈ ఏడాది ఊరగాయలు పెట్టిమ్మంది. ఎంతో కొంత ఇవ్వకపోదు. వీలైతే బట్టలు కూడా కుడదామనుకుంటున్నాను"

"అలాగే చేద్దాం"

మూడేళ్ళు నిండగానే కాన్వెంటులోనే చేర్చారు. ఫీజులూ, యూనిఫారాలూ, రిక్షా. ఖర్చులూ జీతంలో నాలుగో వంతు తినేస్తూ వుండేవి. అవి కూడగట్టుకుందుకింకేదో ఖర్చు తగ్గించుకునేవారు. మోహన్రావు నాలుగైదు చోట్ల ట్యూషన్లు కుదుర్చుకున్నాడు. భారతి ఉన్న వాళ్ళింట్లో ఊరగాయలు పెట్టే, పెళ్ళిళ్ళ పనుల్లో సహాయం చేసే వాళ్ళిచ్చిన ధనమో, పణమో తెస్తూ వుండేది. వచ్చిన వాళ్ళకి జాకెట్లు కుట్టి పెట్టేది. అప్పటికి ఫామిలీ ప్లానింగు బాగా వ్యాప్తిలోకి వచ్చింది కాబట్టి తరవాత పుట్టిన పాప శ్యామలతో ఆపేశారు.

స్కూల్లో రాజా బాగా చదువుకునేవాడు. క్లాసులో ఎప్పుడూ మొదటి రాంకు అతనిదే. స్కూల్లో జరిగే ఆటల పోటీల్లో, డిబేట్సులో అన్నిట్లోనూ ప్రైజులొచ్చేవి. ఏడవ తరగతిలో, పదవ తరగతిలో కూడా మంచి మార్కులతో పాసయ్యేడు. ఇంటర్మీడియెట్ దగ్గర ఊళ్ళోనే చదివాడు. డిగ్రీ కొచ్చేసరికా ఇంట్లో కష్టాలు ప్రారంభమయ్యాయి.

దగ్గర్లో కాలేజీ లేదు. వేరే ఊళ్ళో హాస్టల్లో వుంచి చదివించాలి. వచ్చే స్కాలర్‌షిప్ ఫీజులకీ, పుస్తకాలకీ సరిపోవచ్చేమో. హాస్టల్ ఖర్చు ఎలా భరించడం? కాని ఇంత పైకి వస్తున్నవాణ్ణి మధ్యలో కేవలం డబ్బు లేదని ఆపెయ్యడం తప్పు కదా. ఎలాగోలా మేనేజి చేద్దాం అని నిర్ణయించుకుని కాలేజీలో చేర్పించారు. ప్రావిడెంటు ఫండు మీద లోనుతో డిగ్రీ చేతికొచ్చింది. ఇక చేతికి కొడుకు ఆసరా అనుకుంటూంటే తనకి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యాలనుంది అన్నాడు రాజా. కూతురు ఆ టైంకే డిగ్రీ చదవడానికి రెడీగా వుంది. ఇద్దరికీ చెప్పించడం సాధ్యం కాదు. అమ్మాయికి నచ్చ చెప్పి, ఇంటి మీద అప్పు తెచ్చి, రాజాని పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ని చేశారు. హమ్మయ్య ఇంక కష్టాలు గట్టెక్కేయి అనుకుంటూ వుండగా.....

"అమ్మా, నాకో సంబంధం వచ్చిందమ్మా" అని అరుస్తూ లోపలికి వచ్చాడు రాజా. భారతి నిర్ఘాంతపోయింది. "ఒరేయి అబ్బాయి, సంబంధాలు వస్తున్నాయి. వచ్చిన వాళ్ళకి ఏం చెప్పమంటావు" అంటే "మా అబ్బాయి ఇప్పట్లో చేసుకోడు అని చెప్పేయి" అనడం మామూలుగా జరుగుతూ వుంటుంది. వీడేమిటి తనకి సంబంధం వచ్చిందంటున్నాడు. అయినా ఆడ పెళ్ళివారు పెద్ద వాళ్ళ దగ్గరకు రాకుండా ముందు వీడి దగ్గరకు వెళ్ళడమేమిటి? ఇదేమీ ప్రేమ పెళ్ళి కాదు కదా.

ఈలోగా మోహన్రావు వచ్చాడు.

"ఏమిటి ఎవరికి సంబంధం?"

"నాకే నాన్నగారూ, కోమలా షుగర్ మిల్ ఓనర్ వాళ్ళమ్మాయిని నాకిస్తామన్నారు. అమ్మాయి పేరు కోమల. ఒకర్తే కూతురు. వాళ్ళకింకా యాభై ఎకరాల మాగాణీ, పేపర్ మిల్‌లో షేర్లు అవీ చాలా వున్నాయి"

"అంత వున్న వాళ్ళ అమ్మాయి మనింట్లో వచ్చి వుండగలదా" భారతి అమాయకంగా అడిగింది.

"ఆ అమ్మాయి ఇక్కడికెందుకొస్తుందమ్మా. నేనే అక్కడుండాలి. వాళ్ళ ఫ్యాక్టరీవీ, మిగతావీ అన్ని వ్యవహారాలూ నేనే చూడాలి. షుగర్ మిల్‌కి నన్ను మేనేజింగు డైరెక్టర్ని చేస్తామన్నారు. చూసుకో ఇంత చిన్న వయస్సులో మేనేజింగు డైరెక్టరంటే"

"అదేమిటి ఇల్లరికమా?"

"నువ్వే పేరైనా పెట్టుకో. పెద్ద ఉద్యోగం. పెళ్ళి గ్రాండుగా చేస్తారుట. నీకూ, శ్యామలకీ లాంఛనాలిస్తారుటే"

"లాంఛనాలెవరికి కావాలి?"

మోహనరావు కల్పించుకుని మాట్లాడేడు.

"రాజా, మంచి మార్కులతో పాసయ్యేవు. నీకు తప్పకుండా జాబ్ దొరుకుతుంది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టరన్న పేరే కానీ వాళ్ళకి విశ్వాసంగా పని చేసే నౌకరు కావాలి. ఇంటి అల్లుడు అని ముద్ర వేసి వాళ్ళ ఆస్తి వ్యవహారాలకో గుమస్తాగా తయారు చేస్తారు. ఇల్లరికం వెళ్ళాల్సిన ఖర్మేమిటి? నీకు ఉద్యోగమొచ్చాక శ్యామలను చదివిస్తానన్నాను. దాని గతేమిటి? నీ కక్కడ ఏ విధమైన గౌరవమూ వుండదు. ఒకళ్ళ మీద ఆధారపడి పైకి రావాలనుకోకూడదు. స్వేచ్ఛగా

7-8-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక



తిరిగే గంజి పారతంత్ర్యంలో పరమాన్నం కన్నా గొప్పది''

''నీతి సూత్రాలు చదువుకుందుకే బావుంటాయి. ట్రై చేస్తే నాకు దొరకేదేపాటి ఉద్యోగం? మూడు వేలకన్నా ఎవ్వరూ జీతమివ్వరు. ఏ మూలకది? అక్కడ కారూ, నౌకర్లూ, బంగళా ఏం కావాలంటే అది?''

భారతి ఏడుస్తోంది. శ్యామల బిత్తరపోయి చూస్తోంది. తమ గతేమిటన్నబాధ కొంతా, కొడుకిలా బానిసత్వానికి సిద్ధపడ్డాడన్న బాధ కొంతా మోహన్రావుని కాసేపు మాట్లాడనివ్వ లేదు.

''రాజా, ఆలోచించుకో. మూడు వేల రూపాయిలతో ఎంతో హాయిగా బతకచ్చు. మూడు వందలతో బతికే వాళ్ళున్నారు తెలుసా?''

''ఎలా? ఇలాంటి పెంకుటింట్లో, ఊరగాయ మెతుకులతో. అదీ ఓ బతుకే?''

''ఇన్నాళ్ళూ నువ్వు అలాగే బతికేవు. మర్చిపోకు. ఇంత ధన వ్యామోహం పనికిరాదు. నువ్వు చేసే పనికీ, వ్యభిచారానికీ తేడా లేదు'' కాస్త గట్టిగా మాట్లాడితే మారతాడనుకుని అన్నాడు మోహనరావు.

''వ్యభిచారమేమంత పాపం కాదు. బీదవాడికి పెళ్ళాంగా వుండడం కన్నా డబ్బున్నవాడికి ఉంపుడుకత్తెగా వుండడమే మంచిది''

నిశ్చేష్టుడైపోయాడు మోహన్రావు. మ్రాన్పడిపోయింది భారతి. పరమాన్నం కోసం పంజరంలోకి నడిచేడు రాజా. పెరిగిన గూడు చిన్నబోయింది.

* * * *

ఏముందిందులో కథ? ఇది ప్రతి చోటా, ప్రతి ఇంటా జరుగుతున్నదే కదా! పిల్లలకి జీవిత సర్వస్వం ధారపోసి తల్లితండ్రులు చదువు చెప్పించి, వృద్ధాప్యంలో ఆదుకుంటారని ఆశిస్తారు. పాలు తాగి, రొమ్ము గుద్దడం కలికాల ధర్మం. ఇప్పుడు త్రేతాయుగం కాదు నడుస్తున్నది. ఇక వింతేమున్నది? అయితే ఆ ఇల్లు భారత దేశమయినవాడు; ఆకర్షించిన ఇల్లరికపుటిల్లు పాశ్చాత్య దేశాలయినవాడు; గవర్నమెంటిచ్చే సబ్సిడీతో, స్కాలర్‌షిప్పులతో, స్టైఫండులతో చదువుకుని వలసపోయే ప్రతి ఒక్కరూ రాజా స్థానంలో వున్నవారు కాదా? మరి తల్లితండ్రులెవరు? టాక్స్ కట్టే డబ్బేగా విద్యాశాఖ వాడేది? ఇన్‌కంటాక్స్ కట్టే ప్రతి చిరుద్యోగీ! ఎక్సైజ్ డ్యూటీ రూపంలో, సేల్స్ టాక్స్ రూపంలో పన్నులుకేట్ట ప్రతి పేదవాడూ, భూమి శిస్తూ కట్టే బక్క రైతూ వీరు కాదా నిజంగా భారం మోసేది? సొమ్మొకడిదీ, సోకొకడిదీ అయినా అడిగే హక్కు మాత్రం ఎవరిది? ఈ దేశం మాకేమిచ్చింది అన్న ప్రశ్న అడగాల్సింది అన్నీ అనుభవించి వెళ్ళిపోయిన వారు కాదు; ఇక్కడ ఈ భూమినే నమ్ముకున్న పెద్ద ప్రజానీకం. కానీ వారడగరు. మనది కర్మభూమి కదా!